క్లుప్తంగా

నేటి నుంచి గౌరీదేవి ఉత్సవాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకరుల (గౌరీదేవి) ఉత్సవాలను శనివారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. అట్లతద్దికి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలను సంక్రాంతి వరకూ నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక కళాకారులు వీధి నాటకాలను ప్రదర్శిస్తారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు.

16న ఉచిత కంటి వైద్య శిబిరం

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో ఈ నెల 16న జె.తిమ్మాపురంలోని నెక్కంటి సీఫుడ్స్, విశాఖపట్నానికి చెందిన శంకర్ నేత్రాలయ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు కాట్రావులపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తారని చెప్పారు. అవసరమైతే కంటి శుక్లాల ఆపరేషన్లకు ఏర్పాట్లు చేస్తారన్నారు.

వైస్ ఎంపీపీ బంకు శ్రీనుకు పితృ వియోగం


ఏనుగు వీరరాఘవ రావు (ఫైల్)

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏనుగు శ్రీను (బంకు శ్రీను)కు శుక్రవారం పితృ వియోగం కలిగింది. శ్రీను తండ్రి ఏనుగు వీరరాఘవరావు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామంలో శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే వరుపుల సబ్బారావు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామిశెట్టి బులిరామకృష్ణ తదితరులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

జగ్గంపేట: విజయదశమిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. జె.కొత్తూరు, రామవరం కనకదుర్గమ్మ ఆలయాల వద్ద భారీ అన్నదానాలు ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

నేడు పలు గ్రామాల్లో..

తొండంగి: విజయదశమి సందర్భంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. గోపాలపట్నం, వేమవరం, పెరుమాళ్లపురం, రావికంపాడు, ఒంటిమామిడి, శృంగవృక్షం, బెండపూడి, కొమ్మనాపల్లి తదితర గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మద్యం దుకాణాలకు 347 దరఖాస్తులు


మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ శివ ప్రసాద్


ప్రత్తిపాడు: ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే మద్యం దుకాణాల దరఖాస్తులకు శుక్రవారంతో గడువు ముగిసింది. ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 15 దుకాణాలకు 347 దరఖాస్తులు అందాయని స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. 14వ తేదీన కాకినాడలో లాటరీ ద్వారా దరఖాస్తుదారులను షాపుల నిర్వహణకు ఎంపిక చేస్తారన్నారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు మండలంలోని మూడు షాపులకు అత్యధికంగా 112, కిర్లంపూడి మండలంలో రెండు షాపులకు 50, ఏలేశ్వరం నగర పంచాయతీలో మూడు షాపులకు 46, రూరల్ పరిధిలో మూడు షాపులకు 43, శంఖవరం మండలంలో నాలుగు షాపులకు 96 వెరసి 347 దరఖాస్తులు దాఖలాలైనట్టు సీఐ వివరించారు.

బంగారు నగల బాక్స్ మిస్సింగ్‌పై కేసు

గండేపల్లి: లగేజ్ బ్యాగ్‌లో పెట్టిన బంగారు నగల బాక్స్ మిస్సింగ్‌పై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. విశాఖకు చెందిన మొల్లేటి సుగుణ తన ఇద్దరు పిల్లలతో ఈ నెల 7న ఏలేశ్వరంలో తన అక్క ఇంటి నుంచి పుట్టినిల్లు మండలంలోని మురారికి వెళ్లేందుకు యర్రవరంలో ఆటో ఎక్కింది. మురారి వచ్చాక తనతో తెచ్చుకున్న లగేజ్ బ్యాగ్‌లో పెట్టిన బంగారు ఆభరణాల బాక్స్ కనిపించలేదు. అప్పటి నుంచి బాక్స్ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సత్యదీక్ష వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు: ప్రతిఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి సత్య దీక్ష చేపట్టాలని సత్యదీక్ష ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు కోరారు. స్థానిక మునసబు గారి రామాలయం వద్ద శుక్రవారం సాయంత్రం సత్య దీక్ష వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న అన్నవరంలో 27 రోజుల సత్య దీక్షకు మాలధారణ జరుగుతుందన్నారు. అన్నవరం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు సత్తిరాజు పాల్గొన్నారు.


గోకవరంలో మహిషాసురమర్దిని అలంకారంలో దేవీచౌక్ కనకదుర్గమ్మ


ఏలేశ్వరంలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు


ప్రత్తిపాడులో సామూహిక కుంకుమార్చనలు


రత్నగిరిపై మహిషాసురమర్దినిగా వనదుర్గ అమ్మవారు


రాచపల్లిలో మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు


లోవలో మహిషాసురమర్దినిగా తలుపులమ్మ అమ్మవారు

శుభంకరి.. అభయ ప్రదాయిని

- మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాల్లో విశేష పూజలు


రౌతులపూడి కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

తుని రూరల్/గోకవరం/ఏలేశ్వరం/రౌతులపూడి/కిర్లంపూడి/కోటనందూరు/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/శంఖవరం/గండేపల్లి/తొండంగి/అన్నవరం: శరన్నవరాత్ర ఉత్సవాలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో కన్నులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం జగన్మాత దుర్గాదేవి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లోవ దేవస్థానంలోని తలుపులమ్మతల్లి మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గోకవరంలో దేవీచౌక్ కనకదుర్గమ్మ మహిషాసురమర్దినీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. గోకవరంలో దేవీ చౌక్, వీరభద్రునిగద్దె ఆలయాలను స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దర్శించుకున్నారు.

ఏలేశ్వరంలో...

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ఏలేశ్వరం తోటవీధిలో వేంచేసిన కనకదుర్గమ్మ మహిసాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్టీసీ కాంప్లెక్స్, నర్సీపట్నం రోడ్డు, మార్కెట్‌వీధి తదితర ప్రాంతాల్లో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద పలుసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రౌతులపూడి సినిమా సెంటర్‌లో వెలసిన కనకదుర్గ అమ్మవారు శుక్రవారం మహిసాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కిర్లంపూడి మండలంలో...

కిర్లంపూడి మండలంలోని జగపతినగరంలో వేంచేసిన అభయ దుర్గమ్మ, కిర్లంపూడిలో వాసవీ కన్యకా పరమేశ్వరి, వీరవరం, చిల్లంగి గ్రామాల్లోని కనక దుర్గ అమ్మ వార్లు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించారు.

కాకరాపల్లిలో..

కోటనందూరు మండలం కాకరాపల్లిలో వేంచేసిన కనకదుర్గమ్మ శుక్రవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు. శనివారం అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి శమిపూజ, తెప్పోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రాచపల్లి క్షేత్రంలో...

ప్రత్తిపాడు మండలం రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి వారి దేవస్థానంలో వేంచేసిన అపిత కుచాంబ అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లోని విజయదుర్గా అమ్మవారు, గజ్జనపూడిలో రాజరాజేశ్వరీదేవి, పెద్దిపాలెంలో ఉత్తరకంచి, శరభవరం, గజ్జనపూడి, పోతులూరు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడులోని విజయదుర్గా అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

రత్నగిరిపై అమ్మవార్లకు విశేష పూజలు

రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు శుక్రవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. సింహవాహనంపై అధిరోహించి ధనస్సు, పాశం, బాణం, ఖడ్గం తదితర ఆయుధాలను ధరించి మహిషాసురుడిని సంహరించిన అలంకరణలో అమ్మవార్లు భక్తులను అలరించారు. పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. దర్బారు మండపంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీసూక్త, పురుష సూక్త పారాయణలు, చండీ శప్తశతీ పారాయణలు, సూర్యనమస్కారాలు, నవావరణ అర్చన, సువాసిని పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. దర్బారు మండపంలో చండీ హోమం నిర్వహించారు. శంఖవరం మండలంలోని కత్తిపూడి, శంఖవరం, జి.కొత్తపల్లి, సీతంపేట, నెల్లిపూడి గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. విశేష అలంకరణలో అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విజయదుర్గాదేవి అలంకరణలో నేరేళ్లమ్మ

తొండంగి మండలం గోపాలపట్నంలో వేంచేసిన నేరేళ్లమ్మ అమ్మవారు శుక్రవారం విజయదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కాగా గండేపల్లి మండలం మల్లేపల్లిలో నూతనంగా నిర్మించిన విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

GENERAL PUBLICATION
Schedule:
ADVOCATES

కార్మికులకు న్యాయం చేయాలి


లంపకలోవలో ధర్నా చేస్తున్న కార్మికులతో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీరభద్రా ఎక్స్‌పోర్ట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కార్మికులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ కోరారు. కనీస వేతనాలు చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో ప్రత్తిపాడు మండలం లంపకలోవ వీరభద్రా ఎక్స్‌పోర్ట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ (రొయ్యల మేత కంపెనీ) వద్ద శుక్రవారం కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ వీరభద్రా కంపెనీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇచ్చిన హామీ మేరకు కూటమి నాయకులు, ఉన్నతాధికారులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, కార్మికులు ఎస్.రామారావు, జి.సందీప్, హెచ్.దుర్గ, సీహెచ్ వంశీ, బి.గంగాధర్, ధర్మరాజు, రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ తనిఖీలు


ప్రత్తిపాడులో తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

ప్రత్తిపాడు: శిథిలావస్థలో ఉన్న ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కె.శ్రీరమణి శుక్రవారం తనిఖీ చేశారు. వర్షం వస్తే కార్యాలయంలోని పలు గదుల్లోని నీరు చేరి రికార్డులు తడిసిపోతున్నాయి. దీంతో కార్యాలయం భవనాన్ని ఆమె క్షుణంగా పరిశీలించారు. నూతన భవన నిర్మాణ ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు రూరల్: అనంతరం మండలంలో వంతాడ లాటరైట్ గనులకు చెందిన యార్డ్‌ను ఆర్డీఓ శ్రీరమణి పరిశీలించారు. వంతాడ లాటరైట్ గనుల్లోని లాటరైట్ నిల్వలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.

ఉప్పలపాడులో నిధుల దుర్వినియోగం !


ఉప్పలపాడులో డ్రైనేజీలో వేసిన తాగునీటి కుళాయిని చూపిస్తున్న గ్రామస్తులు

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడులో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి కలిసి నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు గ్రామ నేతలు మేడిబోయిన శ్రీను, సత్తి సోమరాజు, అడబాల సత్యనారాయణ మూర్తి, అంకం ఓం క్రిష్ణ, ఎద్దు రాణి, వార్డు సభ్యులు తలాటం సూరిబాబు, కక్కల రాజు, యాండ్ర శ్రీను తదితరులు శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. పంచాయతీ, ఉపాధి హామీ పథకం, జలజీవన్ మిషన్ నిధులను ప్రస్తుత పాలకవర్గ సభ్యులు దుర్వినియోగం చేసినట్టుగా ఆరోపించారు. తాగునీటి కుళాయిలను తూతూ మంత్రంగా వేసి పూర్తిస్థాయిలో కుళాయిలు ఏర్పాటు చేసినట్టు రికార్డుల్లో నమోదు చేసి సొమ్ములు డ్రా చేశారన్నారు. డ్రైనేజీల్లో కుళాయిలు వేయడంతో తాగునీరు కలుషితమై గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఉన్నతాధికారులు ఈ ఘటనపై విచారణ జరిపి దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

రహదారిలో 'గండం'


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన రంధ్రం

కిర్లంపూడి: ప్రత్తిపాడు-కిర్లంపూడి సరిహద్దు రహదారిలో ప్రగతి ప్రైవేట్ జూనియర్ కాలేజ్ వద్ద రోడ్డు మధ్య రంధ్రం ఏర్పడింది. వాహనదారులకు అది తెలిసేలా సిమ్మెంట్ పెంకును నిలబెట్టి, దానికి ఎరుపు గోనె కట్టారు. ఈ రంధ్రం లోలోపల భారీగా కోతకు గురై గుల్లగా మారింది. ద్విచక్ర వాహనాలు, మరేదైనా పొరబాటున దీనిపై వెళ్తే ప్రమాదానికి గురవ్వడం ఖాయం. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, ఈ గొయ్యిని పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విజయదశమికి సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఉత్సవ కమిటీలు
- గ్రామాల్లో పండగ వాతావరణం


అన్నవరం జూనియర్ కళాశాల మైదానంలో రావణ దహనానికి చేసిన ఏర్పాట్లు


ఏలేశ్వరంలో అమ్మవారి ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లు

ఏలేశ్వరం: దసరా ఉత్సవాల్లో భాగంగా విజయదశమిని శనివారం వైభవంగా నిర్వహించేందుకు నియోజకవర్గవ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. దర్శనాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద దశమికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని తోటవీధిలో వేంచేసిన అమ్మవారి ఆలయం విశిష్టతను సంతరించుకుంది. 1983 నుంచి తోటవీధిలో దశమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానిక నర్సీపట్నం రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, సువ్వయ్యమ్మపేట, లింగంపర్తిలోని సుబ్బారావు కాలనీ, సత్రంపంపు కాలనీలో దశమికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను భారీ ఊరేగింపులతో నిమజ్జనం చేయడానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విజయ దశమికి ఏర్పాట్లు పూర్తి

అన్నవరం: విజయదశమి పర్వదినం సందర్భంగా శనివారం వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. దర్బారు మండపంలో ఉదయం 11 గంటలకు చండీహోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను గజవాహనంపై తొలిపాంచా నుంచి దేవస్థానం హైస్కూల్ వరకూ ఘనంగా ఊరేగింపు నిర్వహిస్తారు. రాత్రి ఏడు గంటలకు హైస్కూల్ వద్ద శమీపూజ నిర్వహిస్తారు.

నేడు కళాశాల మైదానంలో రావణ దహనం

విజయదశమిని పురస్కరించుకుని శనివారం రాత్రి 8 గంటలకు దేవస్థానం జూనియర్ కళాశాల మైదానంలో రావణ దహనం నిర్వహించనున్నారు. ఇందుకోసం 20 అడుగుల ఎత్తయిన రావణుడి బొమ్మను కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు. ఈ బొమ్మను బాణసంచా సామగ్రితో తయారు చేశారు. బాణం వేసిన వెంటనే రావణుడి బొమ్మ అంటుకుని రంగు రంగుల వెలుగులు కనువిందు చేస్తాయి. ఈ మేరకు ఏర్పాట్లను దేవస్థానం ఏసీ రామ్మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ, డీఈ రాంబాబు, ఇతర అధికారులు పరిశీలించారు.

